స్కెచ్

# నైట్ డ్యూటీ

“రాహి”

కింగ్ జార్జి హాస్పిటల్ రెండవ సర్జికల్ వార్డులో మూడవ బెడ్‌మీదున్న రోగి అర్ధరాత్రిలేచి మూల్గుతూ 'సిస్టర్... సిస్టర్' అని పిలిచాడు అప్పుడే నిద్రతెరవచ్చి టేబిలు మీద తలపెట్టుకుని నిద్రపోతున్న మాధవి ఉలిక్కిపడి లేచి వార్డులోకి పరుగెత్తి లైటు వేసింది రోగి బాధగా పొర్లుతూ 'సిస్టర్.... బాధగావుంది. నిద్ర పట్టటంలేదు' అన్నాడు. ఆ రోగికి ఆ నాటి ప్రొద్దున్నే ఆపరేషన్ చేశారు. రెండు సంవత్సరాలుగా భరిస్తున్న కడుపులోని యమబాధ ఆ నాటితో పోతుందన్నాడు, ఆపరేషన్ చేసేముందు పెద్ద సర్జను అంత బాధలోనూ ఆ రోగికి ప్రొద్దుటి తన అనుభవాలు జ్ఞప్తికి రాసాగాయి స్ట్రెచరులో తన్ను ఆపరేషన్ థియేటరుకు మోసుకు వెళ్ళారు. అక్కడ తెల్లటి పాలరాతిగోడలు, తెల్లటి బట్టలు వేసుకున్న నర్సులూ, గంభీరమైన మొహాలతో వున్న సర్జన్లూ అంతా అయోమయంగా, గమ్మత్తుగా కనిపించింది. అక్కడ బల్లమీద పడుకోబెట్టి కళ్ళకు గంతలుకట్టి వెన్నులో సూదివేసి మత్తుమందు ఎక్కించారు అంతే— దానితో నడుం, కాళ్ళూ తిమ్మిరెక్కిపోయాయి తరువాత తనచుట్టూ అంతా గుమిగూడినట్లు జ్ఞాపకం నొప్పేంలేదుగాని కత్తుల చప్పుడు మటుకు భయం కలిగించింది. నిజంగా జీవితంలో మరువలేని అనుభవం. కళ్ళముందు అవన్నీ బొమ్మల్లా ఆడుతున్నాయి. అందుకే కంటిమీద కునుకు రావడంలేదు.

మాధవి ఫోనుదగ్గరికి వెళ్ళి కాజువాల్టీకి రింగ్ చేసింది "హల్లో—నేను రెండవ సర్జికల్ వార్డునుంచి మాట్లాడుతున్నాను ఈ వేళ ఆపరేషన్‌చేసిన ఓ పేషంటు బాధంటూ మూల్గుతున్నాడు. 'డ్యూటీ హౌస్ సర్జన్'ని వెంటనే పంపించండి. అర్జంటు ప్లీజ్" అని రెండు అంగల్లో స్టెరిలైజర్ దగ్గరికివెళ్ళి దానిలో నున్న సిరంజిల్ని తీసి ట్రేలో పడేస్తుండగా, స్టెతస్కోపు వూపుకుంటూ 'డ్యూటీ హౌస్ సర్జన్' రాజగోపాలం వచ్చాడు నిద్రలోంచి లేచి రావడంవల్ల రాజగోపాలం జుట్టు చెదిరివుంది. మాధవి విష్‌చేసి 'మీరా డాక్టర్ నైట్‌డ్యూటీ' అన్నది. రాజగోపాలం కుర్చీలో కూచుని ఆవులిస్తూ 'పంపారు సిస్టర్ మాంచినిద్ర చెడగొట్టారు. ఏమిటీ హడావిడి' అని లేచి నుంచున్నాడు. మాధవి మూడో బెడ్ దగ్గరికి వెళ్తూ రోగి గురించి చెప్పింది. రాజగోపాలం గోడవైపుకు తిరిగున్న రోగిని పలకరిస్తూ 'ఏమండీ! ఎలావుంది' అన్నాడు. రోగి రాజగోపాలం కేసి తిరిగి 'బాధగావుంది. నిద్ర పట్టటంలేదు' అని కళ్ళు మూసుకున్నాడు రాజగోపాలం ఆ రోగి గొంతూ, తరువాత మొహాన్ని చూచి మనిషిని గుర్తుపట్టాడు. ఎవరది, ఎవరది అని మూడుసార్లు ఆలోచించి 'అరే, రామారావు మాస్టారా' అని అనుకున్నాడు కేస్‌షీట్ చూడగానే సందేహం నివృత్తి అయింది తనకు హైస్కూల్లో తెలుగు పాఠాలు చెప్పిన రామారావు మాస్టారిని ఎలా మరచిపోగలడు. హరిశ్చంద్రోపాఖ్యానంలో పద్యాలు ఎంత మధురంగా చదివేవాడని. 'అకటా! చేరెడు నేలకు తగదె' అని గొంతెత్తి పాడుతుంటే, తనూ ఆయనతో కలిపి మనసులో పాడుకునేవాడు.

ఆలోచనలకు స్వస్తిచెప్పి సిస్టర్‌కేసి తిరిగి 'సిస్టర్ డైల్ వుందా' అన్నాడు. 'యస్—డాక్టర్' అంటూ మాధవి రూంలోకి పరుగెత్తుకు వెళ్ళి సిరంజిలో నింపి తీసుకు వచ్చింది రాజగోపాలం యింజక్షన్ యిచ్చి చేతులు కడుక్కుని వచ్చి కుర్చీలో కూచున్నాడు 'డాక్టర్ చాల అలసిపోయారు' అన్నది కనుబొమ లెగరేస్తూ మాధవి. రాజగోపాలం వినిపించుకోలేదు. ఏదో

ఆలోచిస్తున్నాడు ఉలిక్కిపడి 'లేదు సిస్టర్. పాతకాలంనాటి మనుష్యులు హఠాత్తుగా కని పిస్తే మీకెలా వుంటుంది' అన్నాడు. మాధవి జవాబు చెప్పలేదు. రాజగోపాలం మాధవికేసి చూస్తూ 'యిప్పుడు యింజక్షన్ యిచ్చిన రోగిని చూశారా....ఆయన నాకు తెల్సు మాకు హైస్కూల్లో టీచరు' అన్నాడు

మాధవి ఆశ్చర్యపడి 'ఓహో - అలాగా' అన్నది.

రాజగోపాలం చెప్పకుపోతున్నాడు 'మాస్టా రుది గంపెడు సంసారం నల్గురు ఆడపిల్లలు ముగ్గురు మగాళ్ళు. ఆడపిల్లల పెళ్ళిళ్ళుచేసి అత్తారిళ్లకి పంపేటప్పటికి ఉన్న కాస్త భూమి హరించుకుపోవడమే కాకుండా ఐదువేలు అప్ప మిగిలింది అదే యింకొక తండ్రి అయినట్ల యితే గుండె పగిలి చచ్చేవాడు' అన్నాడు మాధవి మొహంలో విషాద రేఖలు కమ్ము కున్నాయి. మెల్లిగా 'అవును డాక్టర్ మానాన్న అలానే పోయారు' అన్నది.

రాజగోపాలం వులిక్కిపడ్డాడు. ఏమిటి? ఎల్లప్పుడూ చిరునవ్వుతో,వికసించిన మొహంతో కలకలలాడే మాధవి జీవితం వెనక విషాద గాథలున్నాయా? నిజమేనా?..

''మీరిప్పుడు చెప్పిన మాస్టారుకు మల్లే మా తండ్రికూడా జీవితంలో రాత్రింబవళ్లు సమ స్యల్ని ఎదుర్కొన్నవాడే. ఆయన చేసిన మంచిపని ఏమిటంటే మా అందరికీ చదువులు చెప్పించారు ఆ చదువులవల్లనే యిప్పుడు, యీ పరిస్థితిలో వున్నాను లేకుంటే మరీ హీనంగా....జుగుప్సాకరంగా బ్రతకాల్సి వచ్చే దేమో'' అన్నది మాధవి, దూరాన్న చీకట్లోకి చూస్తూ. రాజగోపాలం మాట్లాడలేదు. విషాద పూరితమైన ఆమె మొహాన్ని చూస్తూ కూచు న్నాడు | మాధవి కళ్లల్లో నీళ్లు తిరుగు తున్నాయి. అప్రయత్నంగా కళ్లు తుడుచుకుని చెప్పసాగింది. ''డాక్టర్! నిజానికి మా రెండో అక్కయ్య పెళ్ళితో నాన్న క్రుంగిపోయారు. పెద్దక్కయ్య సరేసరి. అత్తారింటికి వెళ్ళినప్ప ట్నించి పుట్టిల్లువున్న సంగతే మరచిపోయింది. ఇద్దరక్కయ్యల పెళ్ళికి మొత్తం నాలుగువేలు అప్పచేశాడు. ఏముందని వెనకాధారం, తన జీతం రాళ్లు తప్పించి అప్పులవాళ్లు గొంతు మీదికివచ్చి కూచుంటే వున్న ఒక్క యిల్లు అమ్మేయాల్సి వచ్చింది. ఆ విచారంతో మంచ మెక్కిపోయారు ' మాధవి కళ్ళల్లో నీళ్లు తిరి గాయి. ఎంత బాధామయ జీవితం!

''డాక్టర్! నమ్మండి - నాన్న పోయిన తరు వాత అమ్మా, నేనూ, ఓ తమ్ముడూ మిగిలాం. ఏదో ఉన్నదానితో మూడు నెలలు గడిపాం. అక్కయ్య లిద్దరూ ఏదో పంపించారుగాని ఎంత కాలం సరిపోతుందని. అంచేత చివరికి తెగించి అంతా వద్దంటున్నా వినక నర్సుగా చేరాను,'' అన్నది మాధవి.

''మీరు నర్సింగులోచేరడం మీవాళ్లకు ఇష్టం లేదా'' అన్నాడు రాజగోపాలం. మాధవి విషా దంగా నవ్వుతూ ''మన జీవితాలకి False prestige అనేది వుందిగదూ డాక్టర్. నేను దీంట్లో చేరడం మన కుటుంబానికి అప్రదిష్టని మరీ మరీ చెప్పింది అమ్మ. అంతేగాని, ఎలా జీవించడం అనే విషయాన్ని గ్రహించలేదు. చివరికి నచ్చచెప్పగా ఒప్పకుందనుకోండి. యిలా వుంటాయి మన-''వాక్యం పూర్తిచేయకుండానే టెలిఫోను మ్రోగింది. మాధవి పరుగెత్తుకుని వెళ్ళి రిసీవ్ చేసుకుని 'హల్లో' అని రాజగోపాలంకేసి తిరిగి 'డాక్టర్! భావనగర్ వార్డునుంచి పిలుపు వచ్చింది. మీరువచ్చి డెత్‌ను సర్టిఫై చేయా లిట' అన్నది. రాజగోపాలం ఆవులిస్తూ లేచి వళ్ళు విరుచుకున్నాడు మాధవి మెల్లిగా నవ్వుతూ 'యీ మాత్రానికే అంత బద్ధకమా' అన్నది. రాజగోపాలం మొహం తుడుచుకుంటూ 'హౌస్ సర్జన్ అవస్థ మీకు తెలీదు సిస్టర్. సాయంత్రంవరకు చేసిన చాకిరీ కాకుండా యీ నైట్ డ్యూటీ ఒకటి మన నెత్తిమీదికి' అని రెండడుగులువేసి 'అచ్ఛా-వస్తా సిస్టర్' అన్నాడు. మాధవి ఓ అడుగు ముందుకువేసి 'డాక్టర్! ఒక్క విషయం. నేను చెప్పిన సంగతులు ఎవరికీ చెప్పకండి' అన్నది. రాజగోపాలం వెనక్కితిరిగి చిఱునవ్వు నవ్వి 'అలాగే సిస్టర్. కాని ఒక్క విషయం. రామారావు మాస్టారిని మట్టుకు జాగ్ర త్తగా చూడండి' అన్నాడు.

మేడమెట్లు దిగుతుండగా క్రింది వార్డులో నవ్వులు వినిపించాయి, రాజగోపాలానికి 'అబ్బా పోండి డాక్టర్' అంటోంది ఓ ఆడ గొంతుక. తర్వాత మెత్తగా మాట్లాడుతున్న ఓ మగ గొంతుక. ఆ గొంతుక తనకు పరిచయమే. చదువుకునే రోజుల్లో రెండేళ్ళు తన రూం మేటుగావున్న మధుమూర్తి గొంతుకను ఎలా మరచిపోగలడు. మధుమూర్తి విషయం తనకు తెలియదు గనకనా. యిప్పటికే హాస్పిటలంతా మార్మోగి పోతుందిగదా. మొదట్లో స్వర్ణలతతో తిరుగుతున్నాడని తనకు తెల్సిననాడే, మధు మూర్తిని ఆ సంగతి అడిగాడు స్వర్ణలతంటే కొత్తగా వచ్చిన స్టాఫ్ నర్సు.

'చూడు బ్రదర్ నా విషయం నీకు బాగా తెల్సు. జీవితంలో ఏది చేయదల్చుకున్నా ముందు ఆలోచన పెట్టుకోను. నా మనస్తత్వం అలాంటిది. యిదీ అంతే. పోనీయి. బండి ఎక్కడికి నడుస్తుందో ఆగిన తరువాత తెలుసు కోవచ్చు' అని భుజాలెగరవేశాడు. కాని యీ మధ్యన రాజగోపాలం మధుమూర్తిని గురించి కొత్త విషయాలు వింటున్నాడు. స్వర్ణలతని పెళ్ళి చేసుకుంటానని మాట యిచ్చాట్ట. యిదెలా తెలిసిందంటే, స్వర్ణలత స్నేహితు రాలు—పేరు కుమారి; రాజగోపాలం పని చేస్తున్న వార్డులోనే వుంది. ఆమె ఓ నాడు మాటల సందర్భంలో మధుమూర్తిని గురించి చెప్పింది. 'అంత సిన్సియర్ మనుషులు లోకంలో చాల అరుదు డాక్టర్! ఆయన స్వర్ణంటే ప్రాణం విడుస్తాడు' అంటుంటే రాజ గోపాలం మధ్యలో జోక్యం చేసుకుని 'ఎంత కాలమని ప్రాణం విడుస్తాడులే సిస్టర్. తన హవుస్ సర్జన్సీ అయింతరువాత కూడానా?' అన్నాడు కుమారి కళ్లు తిప్పుతూ 'ఆయన సంగతి మీకు తెలీదు డాక్టర్ స్వర్ణని ఆయన ఎన్నటికీ మోసం చేయరు' అన్నది అవును-మధుమూర్తి సంగతి రాజగోపాలానికి తెలీదు చదువుకునే రోజుల్లో చదువుల్లోతప్ప మరి దేంట్లోనూ యింటెరెస్టు చూపించని మధు మూర్తికి యీ నాడు స్వర్ణలత స్పెషల్ యింటె రెస్టయింది. లేకపోతే నైట్‌డ్యూటీలోవున్న స్వర్ణలతతో తనూ డ్యూటీ చేస్తున్నాడు! మేడ మెట్లు దిగి క్రిందివార్డులో అడుగుపెట్టిన వెంటనే తన పాదాల చప్పుడుకు నవ్వులు ఆగాయి. డ్యూటీ రూంలో టేబిల్‌కు ఎదురుగావున్న కుర్చీలో మధుమూర్తి కూచుని వున్నాడు. స్వర్ణలత టేబిలుమీద కూచున్నదల్లా రాజ గోపాలాన్ని చూచి లేచి నుంచుంది.

''ఏరా గోపీ-నైట్ డ్యూటీయా'' అన్నాడు మధుమూర్తి. 'కూచోండి డాక్టర్' అని స్వర్ణ లత ప్రక్కనున్న కుర్చీని ముందుకు లాగింది. విధిలేక రాజగోపాలం కూచుని-'సర్వీసు కమీ షన్‌కు అప్లై చేశావా' అన్నాడు, ఏదో ఒకటి మాట్లాడాలి గనక మధుమూర్తితో.

''చేశానుగాని వెళ్దామని లేదు'' అన్నాడు మధుమూర్తి.

రాజగోపాలం ఆశ్చర్యపోయి 'ఏం' అన్నాడు మధుమూర్తి స్వర్ణలతకేసి తిరిగి చిరునవ్వుతో 'వెధవ ఉద్యోగం ఎవడు చేస్తాడ్రా' అన్నాడు. రాజగోపాలం వచ్చినప్పట్నించీ స్వర్ణలతని గమనిస్తున్నాడు. ఆమె కళ్ళతో ఆ అనురాగపు చూపులు....నిజంగా ప్రేమంటే యిదే కాబోలు అని అనుకున్నాడు. స్వర్ణలత వాళ్ళ మాటల్లో జోక్యం కలిగించుకోలేదు. కిచెన్‌లోకి వెళ్ళి రెండు గ్లాసులు తీసుకువచ్చి ఫ్లాస్కులోని కాఫీ పోసి తెచ్చింది రాజగోపాలం భుజాలెగరేసి 'యిదేమిటి యీ మర్యాదలన్నీ నా కెందుకు అర్ధరాత్రి కాఫీ అలవాటు నాకు లేదు'అన్నాడు.

'ఏడిశావులే, త్రాగు'అన్నాడు మధుమూర్తి. స్వర్ణలత చిరునవ్వు నవ్వి 'చదువుకునే రోజుల్లో రోజూ రాత్రిరెండుమార్లు కాఫీ తాగేవారటగదా' అన్నది. రాజగోపాలం బేజారై మధుమూర్తికేసి చూశాడు స్వర్ణలత వచ్చిన నవ్వు ఆపుకుంటూ 'అవును. ఆయనే చెప్పారు.' అన్నది. రాజగో పాలం సర్దుకుని 'మీకు అంతే చెప్పాడా వీడు. ఆ అలవాటు నా కంటగట్టింది వీడే' అంటూ లేచి 'వస్తాన్రా. భావనగర్ వార్డులో పనుంది,' అని విష్‌చేసి నడవసాగాడు. కారిడర్ అంతా నిశ్శబ్దంగావుంది. రివ్వున చల్లటిగాలి వీస్తోంది.

(తరువాయి 45-వ పేజీలో)